# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఇంకుడు కాలువలతో కూడిన మ్యాజిక్ డ్రెయిన్లు మురుగు రహిత పల్లెలను ఆవిష్కరిస్తున్నాయని తెలిపిన ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్.**

2. **పీఎం. సూర్యఘర్ పథకం ఎస్సీ, ఎస్టీలకు ఒక వరమన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్.**

3. **ఉపాధ్యాయులు వృత్తిపరమైన అభివృద్ధి చెందితే నే తరగతి గది రూపాంతరం చెందుతుందని పేర్కొన్న విద్యా శాఖ మంత్రి నారా లోకేష్.**

4. **వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష- నీట్ ఈ రోజు జరగనుంది.**

5. **ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం ఈరోజు.**

==========================

ఇంకుడు కాలువలతో కూడిన మ్యాజిక్ డ్రెయిన్లు మురుగు రహిత పల్లెలను ఆవిష్కరిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇంకుడు కాలువలతో కూడిన మ్యాజిక్ డ్రెయిన్ల పై బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు చేసిన వీడియోను ఉప ముఖ్యమంత్రి ఎక్స్ లో ఈరోజు పంచుకున్నారు. గ్రామాల్లో మురుగు సమస్య అధికంగా ఉంటుందని, మ్యాజిక్ డ్రెయిన్ల ద్వారా వీన్ని పరిష్కరించవచ్చని వీడియో సందేశంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు పేర్కొంటూ..

వాయిస్ 31

--------------------------

పీఎం. సూర్యఘర్ పథకం ఎస్సీ ఎస్టీలకు ఒక వరమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. స్థానిక ఎస్సీ కాలనీలో 120 సోలార్ యూనిట్లు మంజూరవగా 106 పూర్తి అయినట్లు వెల్లడించారు. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ ఎస్టీలకు రెండు కిలో వాట్ల వరకు ఉచితంగా సోలార్ కనెక్షన్లు

అందిస్తు న్నట్లు తెలిపారు. పీఎం కుసుమ్ ద్వారా రైతులకు పగటిపూట నిరంతరాయంగా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తు అందించవచ్చని అన్నారు.

---------------------------

ఉపాధ్యాయులు వృత్తిపరమైన అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుందని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ లో శిక్షణకు రాష్ట్ర ఉత్తమ ఉ పాధ్యాయ అవార్డు గ్రహీతలు 37 మంది నిన్న ఆ దేశం వెళ్లారని మంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. సింగపూర్ లో ఐదు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు వీరు హాజరవుతారని తెలిపారు. ఆధునిక బోధన పద్ధతులు, విమర్శనాత్మక ఆలోచన, విద్యార్థి కేంద్రంగా బోధన విధానాలపై లోతైన అవగాహన పొందనున్నట్లు పేర్కొన్నారు. పాఠ్యప్రణాళిక రూపకల్పన నుంచి పాఠశాలల్లో ప్రత్యక్ష అనుభవం వరకు ప్రపంచ స్థాయి ఉత్తమ విధానాలను నేర్చుకుని, వాటిని తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

---------------------------

రాష్ట్రంలో 'టెలీ మానస్' హెల్ప్‌లైన్ ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్న వారికి నిరంతరాయంగా ఉచిత కౌన్సెలింగ్ సేవలు అందుతున్నాయని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాదవ్ తెలిపారు. విజయవాడ, విశాఖపట్నంలలోని కేంద్రాల పనితీరును ఆయన నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నెల సుమారు 3 వేల మంది ఈ సేవలను వినియోగించుకుంటుండగా, ఇప్పటివరకు మొత్తం 67 వేల 573 కాల్స్ నమోదయ్యాయని వెల్లడించారు. మహిళల నుంచి 52 శాతం కాల్స్ వచ్చాయని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థుల నుంచి కాల్స్ ఎక్కువగా వస్తున్నట్లు పేర్కొన్నారు. వీడియో కాల్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉండగా, అవసరమైతే వైద్యుల సలహాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కొబ్బరి ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించి రైతులకు అదనపు ఆదాయం కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తమిళనాడులోని పొల్లాచ్చి కాయిర్ క్లస్టర్‌ను మంత్రి నిన్న సందర్శించారు. అక్కడి ఆధునిక సాంకేతికతను అధ్యయనం చేయనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి నార పరిశ్రమను బలోపేతం చేయాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. కొబ్బరి పీచుతో తయారయ్యే విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్నందున, రాష్ట్రంలో కాయిర్ క్లస్టర్లు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంచుతామని మంత్రి తెలిపారు.

---------------------------

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-నీట్ ఈ రోజు జరగనుంది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ పరీక్షకు నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్రంలో సుమారు 70 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 28 పట్టణాల్లో 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే హజరు కావాలని ఎన్టిఏ తెలిపింది.

---------------------------

పత్రికా స్వేచ్ఛపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయులకు నివాళులు అర్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా మే 3వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛ అనేది అత్యంత విలువైన దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఆయన పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. నిజాన్ని నిర్భయంగా చెప్పే స్వేచ్ఛ ఉన్నప్పుడే సమాజం సజావుగా ముందుకు సాగుతుందని చెప్పారు. సమాజంలోని అన్యాయాలు, అవినీతి, అసమానతలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత మీడియాపై ఉ ందని, ఆ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించే పాత్రికేయుల సేవలు అపారమని కొనియాడారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే వారధిగా పత్రికా రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

---------------------------

తిరుపతిలో మాదకద్రవ్యాల నిరోధకానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. తిరుపతిలోని ఎస్టివి నగర్, న్యూ ఇందిరానగర్ లలో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి ఈరోజు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తిరుపతిలో అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేదని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొంటూ..

వాయిస్. 21

---------------------------

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఎవరైనా మత్తు పదార్థాల బారిన పడి ఉంటే వారికి అవసరమైన సహాయం అందించేందుకు 1972 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గ్రామ, పట్టణ స్థాయిలలో మత్తు పదార్థాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ సంస్థకు తెలియజేయాలని ఆయన కోరారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది. హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడనున్నాయి. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. నిన్న జరిగిన మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించింది.

=====================